క్లుప్తంగా

ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు అవగాహన



నల్లూరు సచివాలయంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ మూర్తి

కపిలేశ్వరపురం: జగనన్న కాలనీల్లో ఉచిత ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ తీరుతెన్నులపై హౌసింగ్ ఏఈ పీవీఎస్ఎన్ మూర్తి పలు సూచనలు చేశారు. నల్లూరు, కపిలేశ్వరపురం తదితర గ్రామాల సచివాలయాల్లో బుధవారం నిర్వహించిన లబ్ధిదారుల సమావేశాల్లో ఏఈ మూర్తి మాట్లాడుతూ త్వరితగతిన ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలని సూచించారు. స్థలాన్ని ఉచితంగా ఇవ్వడంతో పాటు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందుతుందని, ఇసుక తదితర సామాగ్రి సమకూర్చే విషయంలో ప్రభుత్వ నిబంధనలను వివరించారు. ఆయన వెంట ఆయా గ్రామాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'తో గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం



వాకతిప్పలో వలంటీర్లకు సూచనలు చేస్తున్న కార్యదర్శి శివ చక్రవర్తి

కపిలేశ్వరపురం: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంతో గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుందని ప్రజాప్రతినిధులు, పంచాయతీల కార్యదర్శులు అన్నారు. మండలంలోని వాకతిప్ప, నాగుల చెరువు గ్రామాల వలంటీర్లకు వాకతిప్ప సచివాలయంలో బుధవారం కార్యదర్శి శివ చక్రవర్తి ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాకతిప్ప సర్పంచ్ కొరిపెల్ల వెంకట నాగ స్రవంతి, పీఏసీఎస్ చైర్మన్ మేడిశెట్టి గోవింద్, వైఎస్సార్ సీపీ నాయకులు కొరిపెల్ల ఆనందరావు, ఉప సర్పంచ్ వజ్రపు సుదర్శనరావు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తదితరులతో క్రీడల నిర్వహణపై చర్చించారు. ఆసక్తిగల క్రీడాకారులను గుర్తించడమూ, వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచే విధానంపై శివ చక్రవర్తి అవగాహన కల్పించారు.


క్రీస్తు బోధనలు అనుసరణీయం



కపిలేశ్వరపురంలో సువార్త చెబుతున్న డేనియల్ పాల్

కపిలేశ్వరపురం: ఏసు క్రీస్తు బోధనలు అనుసరణీయమని స్థానిక క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నిర్వహించిన గ్రాండ్ క్రిస్మస్ ఆరాధన వేడుకల్లో పాల్గొన్న వక్తలన్నారు. కపిలేశ్వరపురం మండల పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు రూబేన్ ఆధ్వర్యంలో క్రైస్తవులు కేక్ కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు సువార్త తెలియజేశారు. క్రైస్తవ ప్రబోధకుడు డేనియల్ పాల్ సువార్త సందేశాన్ని ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతికి బైబిల్ బోధనలు ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల చర్చిల నిర్వాహకులు హాజరయ్యారు.

రైతులను ఆదుకోవాలి



తర్లంపూడిలో రైతులతో కలసి ఆందోళన చేస్తున్న రాజబాబు

కాజులూరు: భారీ వర్షాల కారణంగా మండల గ్రామాల్లో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. బుధవారం మండలంలోని తర్లంపూడి, చేదువాడ, మంజేరు, శీల, పెనుమళ్ళ, తనుమళ్ళ, తదితర గ్రామాల్లో రాజబాబు పర్యటించి ముంపుబారిన పడిన పొలాలను పరిశీలించారు. తర్లంపూడిలో ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండల గ్రామాల్లో పొలాలు ముంపుబారిన పడ్డాయన్నారు. రైతులు పంటపై రూ.25 వేలు చొప్పున పెట్టుబడి పెట్టిన తర్వాత వర్షాలకు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలన్నారు.

రూ.50 వేల విరాళం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విజయవాడలో రాజంపేటకు చెందిన దొడ్డపనేని రాజనాయుడు రూ.50 వేల విరాళం అందించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటం అందజేశారు.

వేగంగా తుపాను సహాయక పనులు



అంగరలో జేసీబీ సాయంతో చెత్తను తరలించే పనులను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ సూర్యారావు, ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి



కాలేరులో రహదారిలో విరిగిన చెట్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది



కపిలేశ్వరపురంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ రమేష్‌కుమార్

- పొలాలను వీడని వర్షపు నీరు
- రహదారులపై విరిగిన చెట్ల కొమ్మల తొలగింపు
- డ్రైన్ల నుంచి వ్యర్థాల తొలగింపు
- రోజంతా గ్రామాల్లోనే సేవలందించిన సచివాలయ ఉద్యోగులు

కపిలేశ్వరపురం: ఎట్టకేలకు మిచాంగ్ తుఫాన్ గండం గట్టెక్కింది. భారీ వర్షాలు కురవడంతో పంటలు ముంపుబారిన పడ్డాయి. మంగళవారం రాత్రి భారీ వర్షం కురవడంతో గ్రామాల్లోని డ్రెయిన్లు పొంగి పొర్లాయి. తెల్లవారే సరికి కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వల్లూరు, నేలటూరు, కాలేరు, నల్లూరు వాకతిప్ప, టేకి, మాచర తదితర గ్రామాల వీధులు జలమయం అయ్యాయి. దీంతో ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు పర్యవేక్షణలో సచివాలయ కార్యదర్శుల ఆధ్వర్యంలోని సిబ్బంది రోజంతా శ్రమించారు. అంగర ప్రధాన మురుగు డ్రెయిన్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను జేసీబీ సాయంతో తొలగించారు. గ్రామాల డ్రెయిన్లలోని పూడికను పారిశుధ్య కార్మికులు తొలగించారు. మధ్యాహ్నా సమయానికి వర్షం నీరు నెమ్మదించి వీడింది. కాలేరు తదితర గ్రామాల్లో రహదారులపై నేలకూరిన చిన్నపాటి చెట్లను పంచాయతీ సిబ్బంది తొలగించారు. రాత్రి తెల్లవార్లూ కురిసిన వర్షానికి పలు గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లోని ధాన్యపు రాశులు నీటిలో తేలియాడాయి. ఏఓ రమేష్‌కుమార్, ఆర్బీకే సిబ్బంది రైతుల వెన్నంటి ఉంటూ ధాన్యాన్ని పరిరక్షించుకునే సూచనలను చేశారు.



అంగరలో వర్షపు నీరు పోయేలా గాడి తవ్వుతున్న పనిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి



టేకిలో వర్షపునీటిలో తేలియాడుతున్న ధాన్యం రాశి

ఎంతో కష్టం- రైతులకు నష్టం

- తీరం దాటిన మిచాంగ్ తుపాను
- నీట మునిగిన ధాన్యపు రాశులు, పల్లపు ప్రాంతాలు
- సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం నిమగ్నం
- నష్టనివారణ పనుల్లో రైతన్నలు

కె.గంగవరం: మిచాంగ్ తుపాను రైతులకు ఎంతో కష్టాన్ని, నష్టాన్ని మిగిల్చి వెళ్లింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఎడతెరిపి లేకండా కుండపోతగా కురిసిన వర్షంతో పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. వర్షానికి తోడు ఈదురుగాలులు వీయడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. తుపాను ప్రభావంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. పలు గ్రామాల్లో రోడ్ల పైనా, ఖాళీ స్థలాల్లో, పంట పొలాల్లో కప్పి ఉంచిన ధాన్యం రాసులు నీటమునిగాయి. ఉదయాన్నే రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించే ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిబంధనలు కూడా సడలించి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మంత్రి వేణు కుమారుడు చెల్లుబోయిన నరేన్ పామర్రు, కూళ్ల, భట్లపాలిక గ్రామాల్లో పర్యటించి రైతులకు భరోసా ఇచ్చారు. వర్షం ప్రభావంతో మల్లవరం, కె.గంగవరం, ఊడిమూడి గ్రామాల్లో రోడ్లపై భారీ చెట్లు నేలకొరిగాయి. విషయం తెలుసుకున్న ఎస్సై జానీ బాషా, తహసీల్దార్ వైద్యనాథశర్మ ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వెంటనే తెల్లవారుజాము నుంచి చెట్లను తొలగించే ఏర్పాటు చేశారు.

వర్షపు నీటిని మళ్లించే ఏర్పాట్లు

ఖాళీ స్థలాల్లో రైతులు కప్పి ఉంచిన ధాన్యం రాసుల వర్షానికి నీట మునిగాయి. పామర్రు, కూళ్ల, కె.గంగవరం తదితర గ్రామాల్లో ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆదేశాల మేరకు అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించారు. వెంటనే నిల్వ ఉండిపోయిన నీటిని మోటార్ల సాయంతో పంట కాలువలకు మళ్లించే ఏర్పాట్లు చేశారు. నీరు పోగానే ప్రతి గింజను కొనుగోలు చేస్తామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు.



భట్లపాలికలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి తనయుడు చెల్లుబోయిన నరేన్

కాజులూరులో..

కాజులూరు: పండించిన పంటగింజలు అందంగా చేతికి దక్కుతాయని ఆశించిన రైతుల ఆశలను అశనిపాతంలా భారీవర్షాలు ఆవిరి చేశాయి. పంట మాసూళ్ల దశకు చేరుకుని దిగుబడికి వాతావరణం మంచి అనుకూలంగా ఉందని రైతులు సంతోషిస్తున్న సమయంలో విడవకుండా కురుస్తున్న వర్షాలు నియోజకవర్గంలోని గ్రామాల్లోని రైతులను నష్టాల్లోకి నెట్టేసింది. వర్షానికి తోడు ఈదురుగాలులు తోడవడంతో ఏపుగా పెరిగిన వరిపైరు నేలనంటింది. పంట పక్వానికి వచ్చే దశలో మొక్క పడిపోతే గింజ గట్టిపడకుండా పొల్లు, తప్ప, తాలుగా మారి దిగుబడి గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాను తీరం దాటి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో బుధవారం నియోజకవర్గ గ్రామాల్లో రైతులు నష్టనివారణ పనులు చేపట్టారు. పంట నేలనంటిన మెరకపొలాల్లో రైతులు నీరు బయటకు పోయేందుకు బాటలు వేస్తూ నాలుగైదు కుదుళ్లను కలిపి కట్టి నిలబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పొలాల్లో కోసి ఉంచిన పనలను ఒడ్డుకు చేర్చి నూర్పిళ్లు చేస్తున్నారు. ఇకపైనైనా వర్షాలు తగ్గకపోతే పంటలు పూర్తిగా నీట మునిగిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. నియోజక వర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లోని వరి పొలాలు తూర్పుడెల్టా కాలువ శివారు భూముల్లో ఉన్నాయి. స్థానికంగా కురిసే వర్షాలకు తోడు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరే వరద నీరుతో ఇక్కడి పల్లపు ప్రాంతాల్లోని పొలాలను ముంపునకు గురౌతున్నాయని రైతులు వాపోతున్నారు.



పామర్రులో నీట మునిగిన ధాన్యం రాశులు



కె.గంగవరంలో రోడ్డుపై పడిన చెట్టును దగ్గరుండి తొలగిస్తున్న ఎస్సై జానీబాషా



మొగలిపాలెంలో నేలనంటిన వరిదుబ్బులను నిలబెట్టి కడుతున్న రైతులు

ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తాం

- ఎంపీపీ వెంకటరమణ
- ఎమ్మెల్సీ సూచనలతో ముంపు గ్రామాల్లో పర్యటన

రాయవరం: ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదేశాల మేరకు ఎంపీపీ వెంకటరమణ బుధవారం మండలంలోని చెల్లూరు, మాచవరం, పసలపూడి, లొల్ల తదితర గ్రామాల్లో ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డితో కలిసి పర్యటించారు. పలువురు రైతులతో ఎమ్మెల్సీ త్రిమూర్తులు ఎంపీపీ వెంకటరమణ ఫోన్‌లో మాట్లాడి, వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనేలా రైసుమిల్లర్లతో ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడినట్లు తెలిపారు. ముఖ్యంగా రైతులు నష్టపోకుండా ఆఫ్‌లైన్‌లో కూడా ధాన్యం కొనుగోలుకు ఆదేశాలు ఇచ్చిందన్నారు. పంట పొలాల్లో నీటిని బయటకు పంపే విధంగా అవసరమైన పక్షంలో ఉపాధి హామీ కూలీలను రైతులు వినియోగించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆదేశాలు ఇచ్చిందన్నారు.మాచవరం దళితపేటలో తాటాకిల్లుపై చెట్టు పడిపోయిన ఘటనలో వృద్ధురాలు నిరాశ్రయురాలైంది. పడిపోయిన ఇంటికి నష్టపరిహారం వచ్చేలా రెవెన్యూ శాఖతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని ఎంపీపీ వెంకటరమణ వృద్ధురాలికి హామీ ఇచ్చారు. ఎంపీపీ వెంట సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, ఎంపీటీసీ పలివెల శోభన, మండల సచివాలయ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.



మాచవరంలో వృద్ధురాలికి భరోసా కల్పిస్తున్న ఎంపీపీ వెంకటరమణ

అంబేడ్కర్‌కు ఘన నివాళి

రామచంద్రపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం నియోజకవర్గంలోఆయన విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. బార్ ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలివెల సత్యనారాయణ, సాయి ప్రసాద్ వాడ్రేవు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మా గా అంబేడ్కర్ దేశానికి దిశానిర్దేశం చేశారన్నారు. జోహార్ అంబేడ్కర్ అంటూ నినాదాలు చేశారు. న్యాయవాదులు అంబేడ్కర్‌పై గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి చిన్నం వీర్రెడ్డి, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృథ్వీ, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకుని రామచంద్రపురం మండలంలో అంగన్వాడీ వర్కర్స్–హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉద్దేశించి సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం, అంగన్వాడి వర్కర్స్–హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి దుర్గాంబ, అంగన్వాడీ నాయకులు పాల్గొన్నారు. మోడరన్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మోడరన్ విద్యాసంస్థల అధినేత జీవీ రావు పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రామచంద్రపురం డివిజన్ నాయకులు సాయి చరణ్, అమర్, కరుణాకర్, గౌతమ్, వీరబాబు, విజయ్ తేజా, ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

రూరల్‌లో..

రామచంద్రపురం రూరల్: బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన ఆధ్వర్యంలో ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డీటీలు కర్రి మహాలక్ష్మినాయుడు, జి.శ్రీనివాస్, ఆర్ఐ పెంకే మునీశ్వర్, సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. మండలంలోని గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ద్రాక్షారామలో అంబేడ్కర్ విగ్రహానికి జై భీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు, దళిత సంఘాల నాయకులు ఘనంగా నివాళి అర్పించారు.



ద్రాక్షారామలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రజా, దళిత సంఘాల నాయకులు



రామచంద్రపురంబార్ అసోసియేషన్ ఆఫీసులో అంబేడ్కర్ చిత్ర పటానికి న్యాయవాదుల నివాళి



రామచంద్రపురం మెయిన్ రోడ్డుపై అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీలు

ప్రభుత్వ విధానాలతో రైతులకు మేలు



తాడిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు రెడ్నం సతీష్

రామచంద్రపురం రూరల్: ధాన్యం కొనుగోలు విషయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు రైతులకు మేలు చేకూరుస్తున్నాయని కాపవరం ఎంపీటీసీ రెడ్నం సతీష్ అన్నారు. కాపవరం, తాడిపల్లి గ్రామాల్లో వీఆర్ఓ శ్రావణి, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎం.నవ్య సుధ, డేటా ఎంట్రీ ఆపరేటర్ గీసాల మునీశ్వరరావు, హెల్పర్ కొల్లపు శృతిలతో కలసి పర్యటించారు. తాడిపల్లి గ్రామంలో రైతులు 316 ఎకరాల్లో పంటను ఆర్బీకేలో ఈ–క్రాప్ చేయించుకున్నారన్నారు. అందులో 276 ఎకరాలలో ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతుల ఖాతాల్లో డబ్బులు కూడా పడ్డాయన్నారు. గ్రామంలోని ఏ ఒక్క రైతూ తుపాను బారిన పడలేదని తెలిపారు. మిగిలిన 40 ఎకరాల్లోని పంటను రైతుల నుంచి ఏ స్థితిలో ఉన్నా సకాలంలో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కొందరు ప్రతిపక్ష నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని రైతులకు మేలు చేస్తున్న ప్రభుత్వ విధానాలపై బురద జల్లడం సరికాదని హితవు పలికారు.

ధాన్యపు రాశులు పరిశీలించిన ప్రత్యేకాధికారి

రాయవరం: మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర్ బుధవారం మండలంలోని వెంటూరు, కురకాళ్లపల్లి, కూర్మాపురం గ్రామాల్లో పర్యటించారు. ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్, తహసీల్దారు కేజీ ప్రకాష్‌బాబుతో కలిసి తడిసిన ధాన్యపు రాశులను శివశంకర్ పరిశీలించి, రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని, కోత కోసి కుప్పలు వేసుకున్న వాటిని, రంగు మారకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా తీసుకుంటున్న సహాయక చర్యలను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కుప్పలపై ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయడం, తడిచిన ధాన్యం రాశులకు 20 కేజీల వరి ఊక లేదా పొట్టును, కేజీ ఉప్పును ఒక 100 కేజీల ధాన్యానికి కలుపు కుంటే ధాన్యం రంగు మారకుండా, మొలక రాకుండా కాపాడుకోవచ్చునన్నారు. మూడు రోజులుగా తడిసిన ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలిస్తున్నట్లు ఏవో ప్రభాకర్ ప్రత్యేకాధికారి శివశంకర్‌కు వివరించారు. తడిసిన ధాన్యాన్ని దగ్గరలో డ్రయ్యర్ ఉన్న రైస్ మిల్లుకు తరలించాలని ఆదేశించామన్నారు.

తాచుపాము పట్టివేత

సఖినేటిపల్లి: అంతర్వేదికరలోని రావి త్రినాథులు ఇంట్లో మంగళవారం రాత్రి చొరబడిన ఓ తాచుపామును బుధవారం ఉప్పలగుప్తం మండలం భీమనపల్లికి చెందిన స్నేక్‌క్యాచర్ గణేష్ వర్మ బంధించారు. వంటింట్లో రాత్రి బుసలు కొడుతున్న శబ్దం విన్న ఇంటి యజమాని గణేష్‌వర్మకు సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన సదరు ఇంటికి చేరుకున్న వర్మ, గోధుమతాచును గుర్తించి, చాకచక్యంతో డబ్బాలో బంధించారు. దీంతో ఇంట్లో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. పామును బంధించిన వర్మకు అభినందనలు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



మండపేట పట్టణంలో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల ఏర్పాటు పనులకు బుధవారం మండపేట పట్టణంలోని కరాచీ సెంటర్‌లో ప్రజాప్రతినిధులు, విగ్రహాల ఏర్పాటు కమిటీ నాయకులు భూమిపూజ చేశారు. మహనీయుల విగ్రహాల ఏర్పాటు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ ముక్కా మేరీ స్వరూపరాణి, దళిత ప్రజాప్రతినిధులు బూరిగ ఆశీర్వాదం, మండపల్లి రవికుమార్, ముమ్మిడివరపు బాపిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటుపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవ చారిత్రాత్మక మైనదన్నారు. దళిత నాయకులు మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పిన మహనీయుల విగ్రహాలను పట్టణ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేయడం వారికి సముచిత స్థానాన్ని ఇవ్వడమే అన్నారు. ఏర్పాటుకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేయడాన్ని అభినందించారు. విగ్రహాల శిల్పి రాజ్‌కుమార్ వడయార్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించి భూమిపూజ చేశారు. అంబేడ్కర్ 67 వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన త్యాగ నిరతిని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు వేగుళ్ల నారయ్యబాబు, పిల్లి గణేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, నాయకులు పలివెల సుధాకర్, గూటం సత్యనారాయణ, తుపాకుల ప్రసన్నకుమార్, సాదే పిడుగు రాముడు, పోతంశెట్టి వరప్రసాద్, మీగడ శ్రీనివాస్, షేక్ అలీఖాన్ బాబా, చోడే శ్రీకృష్ణ, ముక్కా లోవలక్ష్మి పాల్గొన్నారు.

పలివెల ధర్మసత్రం భూమి కౌలుకు వేలం

కొత్తపేట: మండలంలోని పలివెల ధర్మసత్రానికి చెందిన 1.69 ఎకరాల భూమి కౌలుకు ఉపయోగించుకునేందుకు వేలం నిర్వహించినట్లు ధర్మసత్రం ఈఓ నడింపల్లి ప్రసాదరాజు తెలిపారు. పలివెల గ్రామం పరిధిలోని ఆ భూమిని 11 సంవత్సరాల పాటు కమర్షియల్‌గా వినియోగించుకునేందుకు బుధవారం ఎండోమెంట్స్ అండ్ ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భారతి సమక్షంలో వేలం పెట్టగా బహిరంగ వేలంలో పి.గన్నవరం మండలం పప్పులవారిపాలెం గ్రామానికి చెందిన వాసుకూరి వెంకటసాయిరామ్ హెచ్చు పాటగా నెలకు రూ.23 వేలు శిస్తు చెల్లించేలా పాడుకున్నట్టు ఈఓ ప్రసాదరాజు తెలిపారు. 3 సంవత్సరాల అనంతరం నుంచీ ప్రతి మూడేళ్లకు పాడుకున్న మొత్తంపై 30 శాతం పెంచి చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ధర్మసత్రం చైర్మన్ చప్పిడి సాయిబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

కొత్తపేట: జాతీయ లోక్ అదాలత్ పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 9న స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసుల కక్షిదారులు రాజీ చేసుకునేందుకు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.